క్లుప్తంగా

సోషల్ సబ్జెక్టుపై ప్రత్యేక తరగతులు

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు సోషల్ సబ్జెక్టుపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్టడీసర్కిల్ ట్రైనర్ మణికంఠ విద్యార్థులకు సోషల్‌సబ్జెక్టులో పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరుకావాలన్నారు.

గుడ్‌మార్నింగ్ పోస్టర్ ఆవిష్కరణ



ఏలేశ్వరంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: నగర పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గుడ్‌మార్నింగ్ నగర పంచాయతీ కార్యక్రమ పోస్టర్‌ను పట్టణంలో శుక్రవారం ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య ఆధ్వర్యంలో స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం మన నగర పంచాయతీ బాగుపడాలంటే రావాలి జగన్ కావాలి పర్వత ప్రసాద్ అనే నినాదం ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇళ్లకు వద్దకు వెళ్లి ప్రజసమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే గుడ్‌మార్నింగ్ ముఖ్యోద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొదిరెడ్డి గోపి, డేగల వెంకటరమణ, తొండారపు రాంబాబు, మసిరపు నాగేశ్వరరావు, కోనాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

31న శ్రీప్రకాష్‌లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

తుని: పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో ఈ నెల 31న హైదరాబాద్ ఎంఎస్ఎన్ ట్యాబ్స్ సంస్థ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.వీర్రాజు శుక్రవారం తెలిపారు. 2021, 2022, 2023 విద్యా సంవత్సరాల్లో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసి కెమిస్ట్రీ సబ్జెక్టుగా ఉన్నవారు ఈ రిక్రూట్‌మెంట్‌కు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. ఎంపిక ప్రక్రియలో తొలుత రాతపరీక్ష, అనంతరం ఇంటర్వ్యూ ఉంటుందని ప్రిన్సిపాల్ వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

తుని: పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సీఐ ఎం.నాగదుర్గారావు కోరారు. శుక్రవారం పట్టణ ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌ను ఆయన పరిశీలించారు. గొల్ల అప్పారావు సెంటర్, తాండవ బ్రిడ్జి దగ్గర ఆటోలు విచ్చలవిడిగా నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, పోలీసులు కేటాయించిన ప్రాంతాల్లోనే వాహనాలు పార్కింగ్ చేయాలని సూచించారు. ప్రధాన సెంటర్లలో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేశామని, వీరికి వాహన చోదకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

8న ఉమారామలింగేశ్వస్వామి ఆలయ ప్రారంభోత్సవం

శంఖవరం: మండపం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఉమా రామలింగేశ్వర స్వామివారి ఆలయాన్ని జూన్ 8వ తేదీన ప్రారంభించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికలను వివిధ ఆలయాల్లో దేవతామూర్తులకు చెంత ఉంచి ఆవిష్కరించారు.ఆలయ ప్రారంభోత్సవాలు ఐదు రోజులపాటు జరగనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా యాగం, శిఖర ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, శివలింగం, వినాయకుడు, కుమారస్వామి, పార్వతి దేవి, లక్ష్మీనారాంగా యణ, నందీశ్వరుడు, కాలభైరవుడు, చండేశ్వరుడు, ఆంజనేయస్వామి, మొదలగు విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు.

బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

కిర్లంపూడి: బీజేపీ విధివిధానాలను మండలంలోని ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని ఈ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, జగ్గంపేట అసెంబ్లీ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ అన్నారు. శుక్రవారం బూరుగుపూడిలో మండల అధ్యక్షుడు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన మండల కార్యవర్గ సభ్య సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. మండల ఉపాధ్యాక్షుడు జ్యోతుల దుర్గాప్రసాద్, బాలిన వెంకటేశ్వరావు పలువురు పాల్గొన్నారు.

జగ్గంపేట: బీజేపీ మండల కార్యవర్గ సమావేశం జగ్గంపేట సాహితి స్కూల్‌లో శుక్రవారం మండల ఉపాధ్యక్షుడు బి.వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. పార్టీ అభివృద్ధి గురించి తెలియజేసిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ట మంగరాజు, నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ, ప్రోగ్రామ్ ఇన్‌చార్జికామినేని జయశ్రీ, ఏఎల్ ఆర్ శర్మ, సునీత, ఎం వరలక్ష్మి, పవన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు మోక్షం

- జగన్నాథపురం-భీమవరపుకోట రోడ్డులో బ్రిడ్జి నిర్మాణం
- వెంకటాచలం చెరువు లాకుల అభివృద్ధికి ప్రతిపాదనలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు, రైతులు



జగన్నాథపురం-భీమవరపుకోట రోడ్డుకు పడిన గండి(ఫైల్)

కోటనందూరు: ఎన్నో ఏళ్లనాటి కల నెరవేరనుంది. జగన్నాథపురం-భీమవరపుకోట రోడ్డులో దశాబ్దాల నాటి సమస్యకు మోక్షం లభించింది. ఈ రోడ్డులో పుష్కర కాలానికి ముందు పడిన గండి వద్ద రూ.40 లక్షలతో బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మరో పక్క ఇదే రోడ్డులో ఉన్న వెంకటాచలం చెరువుపై కొట్టుకుపోయిన లాకుల ఏర్పాటుకు రూ.30లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. తొందరలో లాకులు అభివృద్ధి పనులు సైతం ప్రారంభం కానున్నాయి. బ్రిడ్జి నిర్మాణం, లాకులు అభివృద్ధి పనులు పూర్తయితే 20 గ్రామాల ప్రజల రాకపోకలతో పాటు వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుబాటులోకి రానున్నాయి. దశాబ్దాల నాటి సమస్యను పరిష్కరించడంపై ఈ ప్రాంత ప్రజలతో పాటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

2010లో సంభవించిన తుపానుకు జగన్నాథపురం -భీమవరపుకోట రోడ్డులో వెంకటాచలం చెరువుపై ఉన్న రోడ్డుతో పాటు చెరువుకున్న లాకులు దిగువఉన్న పొలాల్లోకి కొట్టుకుపోయాయి. రోడ్డుకు గండి ఏర్పడడం వల్ల ఈ మార్గంలో మండలంలోని జగన్నాథపురం, భీమవరపుకోట, ఎస్సార్‌పేట, అప్పలరాజుపేట, బంగారయ్య పేట, బిళ్లనందూరు గ్రామాలతో పాటు అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలోని మరి కొన్ని గ్రామాల ప్రజలు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితుల్లో ఈ గ్రామాల ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. అలాగే లాకులు కొట్టుకుపోవడం వల్ల ఈ చెరువు కింద ఉన్న వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. గతంలో వర్షం, తాండవ జలాశయం నుంచి వచ్చిన నీటిని చెరువులో నిల్వ చేసి చెరువుకున్న లాకుల ద్వారా ఆయకట్టు అవసరానికనుగుణంగా రైతులు నీటిని విడుదల చేసుకునేవారు. అయితే చెరువుకు ఉన్న లాకులు కొట్టుకుపోవడంతో చెరువులో నీరు నిల్వ ఉండడం లేదు. లాకులు లేకపోవడంతో చెరువులోకి ఎలా వచ్చిన నీరు అలా వృథాగా కిందకి పోయేది.



బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

తీరనున్న ప్రజల కష్టాలు



ఎప్పుడో 12 ఏళ్ల క్రితం ఈ రోడ్డుకు గండి పడింది. చెరువుకున్న లాకులు సైతం కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి ఈ రోడ్డులో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అత్యవసర సమయాల్లో ప్రయాణానికి ఈ ప్రాంత ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. లాకులు కొట్టుకుపోవడం వల్ల చెరువులో నీరు నిల్వ ఉండక ఆయకట్టు వర్షాధారంగా మారిపోయింది. అవసరానికి పొలాలకు సాగునీరు అందడం లేదు. బ్రిడ్జి నిర్మాణం, లాకులు ఏర్పాటు పూర్తయితే ఈ ప్రాంత ప్రజల, రైతుల కష్టాలు తీరతాయి.

– భీమిరెడ్డి నాగబాబు, రైతు, జగన్నాథపురం

పట్టించుకోని గత పాలకులు

పన్నెండేళ్ల క్రితం ఏర్పడిన గండిని పూడ్చాలని, చెరువుకు ఏర్పాటు చేసిన లాకులను అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు, రైతులు గత పాలకులను ఎన్నిసార్లు అభ్యర్థించినా పట్టించుకోలేదు. అనేక సందర్భాల్లో సమస్యను పరిష్కరిస్తామని గత పాలకులు హామీలు గుప్పించినా అవి కార్యరూపం దాల్చలేదు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి దాడిశెట్టి రాజా సమస్యను పరిష్కరించారు. సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులేశారు.

సత్యదేవుని దర్శించిన మంత్రి ధర్మాన ప్రసాదరావు



మంత్రి ధర్మానకు సత్యదేవుని చిత్రపటాన్ని అందజేస్తున్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఏసీ రమేష్ బాబు

అన్నవరం: రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖల మంత్రి ధర్మాన ప్రసాదరావు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయన ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు అందజేశారు. వారి వెంట శంఖవరం ఆర్‌ఐ ప్రసాద్, ఆలయ ఏఈఓ కృష్ణారావు తదితరులున్నారు.

వృద్ధులకు అన్నసమారాధన

ప్రత్తిపాడు: యూటీఎఫ్ నేత, సీఐటీయూ సీనియర్ నాయకుడు బెహరా లచ్చారావు మాస్టారు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు ఆధ్వర్యంలో స్థానిక జాతీయ రహదారిపై ఉన్న శ్రీశారదా వయోవృద్ధ నిలయంలో అన్న సమారాధన నిర్వహించారు. వృద్ధులకు జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజ రాజేశ్వరి పండ్లు పంపిణీ చేశారు. గ్రామ ఉప సర్పంచ్ మదినే నూకరాజు, యోగా గురు తాతపూడి బుజ్జి, కట్టమూరి కొండబాబు, ధరణాలకోట తాతబ్బాయి, మూరా థామస్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కౌలుదారులకు సాగుహక్కు పత్రాలు తప్పనిసరి



హంసవరంలో కౌలుదారులకు సీసీఆర్‌సీ ప్రయోజనాలను వివరిస్తున్న ఏఓ అశోక్ కుమార్

తుని రూరల్: కౌలుదారుల ప్రయోజనాలు, హక్కులు పొందేందుకు సాగుహక్కు పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం చామవరం, హంసవరం గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచుల అధ్యక్షతన కౌలుదారుల అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఏఓ మాట్లాడుతూ సాగుహక్కు పత్రాలు ఉన్నప్పుడే ప్రభుత్వం నుంచి రాయితీలు, ఇన్‌పుడ్ సబ్సిడీ, పంటల బీమా, ఫలసాయం విక్రయించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కౌలుదారుల చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తుందన్నారు. మెట్ట భూములు అనుకూలంగా ఉన్నందును రైతులు చిరుధాన్యాల సాగు చేపట్టాలని, రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అర్హులకు కౌలుదారు కార్డులను పంపిణీ చశారు. హంసవరం సర్పంచ్ రాయి మేరీఅవినాష్, ఏఈఓ జగ్గప్పారావు, విఆర్వోలు, వీఏఏలు, కౌలుదారులు పాల్గొన్నారు.

పర్యావరణ జీవనశైలిపై అవగాహన



మొక్కల పెంపకంపై ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

కోటనందూరు: కేఈ చిన్నయ్యపాలెంలో శుక్రవారం పర్యావరణ జీవనశైలిపై అవగాహన కార్యక్రమం జరిగింది. నాబార్డ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో స్వరాజ్య అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు యళ్లి పద్మలత పాల్గొని మాట్లాడుతూ మనకున్న వనరులను విచక్షణా రహిత, విధ్వంసకర వినియోగానికి బదులు విచక్షణ సహిత, ఉద్దేశపూర్వక వినియోగ దిశగా మార్పు చెందడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజల జీవనశైలిలో చిన్నచిన్న మార్పులు చేసుకోవడం ద్వారా పర్యావరణహిత జీవనశైలి విజేతలుగా మారవచ్చన్నారు. అనంతరం మొక్కలు పెంపకం, పర్యావరణ పరిరక్షణకు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. సంస్థ ప్రతినిధులు గణేష్, పూజ, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవన శైలిని అలవర్చుకోవాలి

గోకవరం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యోకర జీవన శైలిని అలవర్చుకోవాలని కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ నిఖిత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పర్యావరణ హిత జీవన శైలి కార్యక్రమంపై వైద్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ భారతి, హెచ్‌వీలు అరుణోనమ్మ, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గమ్మకు చండీహోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి దుర్గామాత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పూజలు చేసి, చండీ హోమం ప్రారంభించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారికి వేదపండితులు నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాదాలు సమర్పించారు. వేదపండితులు హనుమంతువఝ్జల అవధాని, ఆలయ అర్చకులు వడలి నర్సింహామూర్తి, నిట్టల కామేశ్వరరావు, వ్రతపురోహితులు దేవులపల్లి ప్రకాష్ తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 30 జంటలు రూ.750 టిక్కెట్‌తో ప్రత్యక్షంగా, మరో భక్తుడు ఆన్‌లైన్‌లో రూ.750 రుసుం చెల్లించి పరోక్షంగా హోమంలో పాల్గొన్నారు. సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి, తొలిపావంచ వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమార్చన చేశారు. అనంతరం నీరాజనమంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, అర్చకులు సుధీర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీపై కేసు

కిర్లంపూడి: రాజుపాలెం గ్రామానికి చెందిన కంత భద్రినారాయణ ఇంటిలో చోరీ జరిగిందంటూ గురువారం అర్ధరాత్రి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల భద్రినారాయణ తీర్థయాత్రలకు వెళ్లాడు. అదే అదునుగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి నగదు, బంగారు ఆభరణాలు అపహరించారు. వాటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలిపారు. బాధితుడు సోదరుడు కంత సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి మృతి

కిర్లంపూడి: మద్యానికి బానిసై తాగిన మత్తులో చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రపురం గ్రామానికి చెందిన కుందేటి ఏసుబాబు(42) గత కొన్ని రోజులుగా మద్యం తాగి తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. శుక్రవారం ఉదయం మద్యం తాగి స్థానిక అరటితోటకు వెళ్లి చేప చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

జగ్గంపేట: కాట్రావులపల్లి గ్రామ శివారున మామిడి తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం తెల్లవారుజామున జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.12వేలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.

చురుగ్గా ఆస్పత్రి భవన నిర్మాణ పనులు

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం భవనానికి శ్లాబ్ వేశారు. ఈ పనులను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి పర్యవేక్షించారు. ఈ పనులను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

ప్రమాదాల నివారణపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న సీఐ సూర్యఅప్పారావు

జగ్గంపేట: స్థానిక గోకవరం రోడ్డులోని ట్యాక్సీ స్టాండ్ వద్ద కారు, వ్యాన్, ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రమాదాల జరగడానికి కారణాలు డ్రైవింగ్ చేసే వారి తప్పిదాలు, దీని వల్ల జరిగే నష్టం, గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్, డ్రైవర్లు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ప్రత్తిపాడు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి శింగిలిదేవి సత్తిరాజు కోరారు. ప్రత్తిపాడులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దాకే కృష్ణారావు, మదినే బాబ్జి, దేవర రామకృష్ణ యాదవ్, పార్టీ విస్తారక్ ఈగల వెంకటేశ్వరరావు, పెట్లు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ డ్రైనేజీ ప్రారంభం



సంజీవయ్యనగర్‌లోని సీసీ డ్రైనేజీని ప్రారంభించిన నాయకులు

గోకవరం: స్థానిక సంజీవయ్యనగర్‌లోని మొదటి వీధిలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైనేజీని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఎంపీటీసీ తోలేటి రమ్యశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, ఈటంకాల శ్రీనివాస్‌రావులు డ్రైనేజీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి, వార్డు సభ్యులు తుమ్మల శివాజీ, బి.వి .చంద్రం నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందినట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మురారికి చెందిన దబ్బా రఘుపతమ్మ(63) గురువారం మల్లేపల్లిలో బంధువుల ఇంట జరిగే వివాహం వేడుకకు వెళ్లి తిరుగు ప్రయాణంలో గ్రామంలో రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిని ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు తెలియజేశారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు పేర్కొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు



ఎస్.పైడిపాలలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- ఎస్.పైడిపాలలో గడప గడపకూ మన ప్రభుత్వం

రౌతులపూడి: కుల, మత, వర్గ, రాజకీయ బేధంలేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎస్.పైడిపాలలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైఎస్సార్ సీపీ నాయకులు జిగిరెడ్డి సత్తిబాబు, రాయి ప్రసాద్, మండల పార్టీ కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధులతో కలసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటా పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల వల్ల కలిగే లబ్ధిని వివరించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పారేపల్లి శ్రీరామకృష్ణ, గొల్లు వెంకటరమణ, పోలోజు రాజగోవింద్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలోని కనకదుర్గమ్మ శుక్రవారం భక్తులకు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అమెరికా వాస్తవ్యుడు కంబాల శ్రీనివాసరావు సహకారంతో 25 కేజీల పులిహోర ప్రసాదం వితరణ చేశారు.

ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న దేవీచౌక్ కనకదుర్గమ్మ



భూముల రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయండి

రౌతులపూడి: గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేను త్వరితగతని పూర్తి చేయాలని ఆర్డీఓ సీతారామారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎల్.శివకుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన కౌలు రైతులందరూ రుణ అర్హత కార్డులు పొందాలన్నారు. అనంతరం వివిధ భూముల సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పీవీవీ సత్యనారయణ, వీఆర్వోలు గిరి, గోవిందుకుమార్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఘనంగా సన్మానం



వి.కొత్తూరులో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచ్, నాయకులు

తుని రూరల్: ప్రభుత్వానికి అనుబంధంగా ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న వలంటీర్లను స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం వి.కొత్తూరులో సర్పంచ్ దుంగల గణపతి రోజమణి అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైఎస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ పాల్గొని వలంటీర్లను సన్మానించారు. ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎంపీడీఓ విద్యాసాగర్ కుమార్, నాయకులు దుంగల నాగేశ్వరరావు, చిటికెల వరహాలబాబు, కిల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సమ్మర్ క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందజేస్తున్న హైస్కూలు ఉపాధ్యాయులు

కరప: మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీలో శుక్రవారం మూడు మ్యాచ్‌లు జరిగాయి. అండర్–19 విభాగంలో కూరాడ, వేములవాడ జట్లు పోటీపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన కూరాడ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 51 పరుగులు చేయగా, వేములవాడ జట్టు 3.3 ఓవర్లలోనే 55 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా బి.సూర్య (వేములవాడ) నిలిచాడు. నో ఏజ్ లిమిట్ విభాగంలో ముందుగా బ్యాటింగ్ చేసిన హసనబాద్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 48 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత చేజింగ్‌కు దిగిన పండలపాక జట్టు 50 పరుగులు చేసి విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ప్రకాష్ నిలిచాడు. రెండో మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కరప సీఏకే ఫ్రెండ్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 45 పరుగులు చేయగా శీల జట్టు 9.2 ఓవర్లలో 41 పరుగులకు ఆలౌటై పరాజయం పాలైంది. మ్యాన్ ఆఫ్‌దిమ్యాచ్‌గా చంద్రమౌళి(కరప) నిలిచాడు. మ్యాన్ ఆఫ్‌దిమ్యాచ్ అవార్డులను హైస్కూలు ఉపాధ్యాయులు ఆచారి, శ్రీనివాస్ అందజేశారు.